

# ఉపకారం

ప్రతాప వెంకటసుబ్బారాయుడు

రాత్రి తొమ్మిదిగంటలు.

సికింద్రాబాద్ స్టేషన్ నుంచి నెమ్మదిగా ట్రైన్ కదిలింది. పెళ్ళిళ్ల సీజన్ కావడంతో రైళ్లన్నీ జనంతో కిటకిటలాడుతున్నాయి.

ఎలాగో కూర్చోడానికి కాస్త స్థలం సంపాదించుకున్నాను. అంతా గోలగోలగా ఉంది. కొంతమంది బుట్టల్లోంచి ఫలహారాలు, భోజనాలు తీసి తినడానికి ఉపక్రమిస్తున్నారు. మరికొంతమంది లోకాభిరామాయణంలో మునిగిపోయారు.

ఎదుట ఉన్నతను పరిచయం ఉన్న వ్యక్తిలా అనిపించాడు. అతనెవరో గుర్తుకురావడం లేదు. ఒకవేళ మనిషిని పోలిన మనిషి ఉంటారేమో అనుకున్నాను. ఎవరితో మాట్లాడకుండా అతను కిటికీలోంచి బయట చీకటిని చూస్తున్నాడు.

నేను పెట్టెలోని వాళ్ళు మాట్లాడే మాటల్లో ఏమైనా ఆసక్తికర అంశాలు ఉంటాయేమోనని వింటున్నాను. అంతలో భోజనాలు ముగించుకున్న వాళ్ళు మిగతావాళ్ళు కలిసి పేకాట మొదలెట్టారు. నిద్రపోదామనుకుంటున్న నాలాంటి వాళ్ళు ఎప్పుడు లైటార్పేస్తారా? అని ఎదురుచూస్తుంటే మెజార్టీ మెంబర్లు పేకాట ఆడుతుండడంతో చేసేదేం లేక వాళ్ల వంక చూస్తుండిపోయాను.

రెండుమూడు గంటల నుండి ఆట అలా రసవత్తరంగా సాగుతుండగా హఠాత్తుగా ఒకావిడ గట్టిగా "హమ్మా..." అని కడుపు పట్టుకుని లుంగలు చుట్టుకుపోతోంది. అప్పటిదాకా పేకాడుతున్న వాళ్లాయన- "ఏమైందే శాంతీ?" అంటూ ఆందోళనగా ఆవిడ దగ్గరకు వెళ్లాడు.

"ఏమోనండీ ఉన్నట్టుండి కడుపునొప్పి ప్రారంభమైంది. భరించలేకపోతున్నాను" నొప్పికి పెదాలు కొరుక్కుంటూ మాటలు కూడదీసుకుంటూ కళ్ళనీళ్లతో చెప్పింది.

"వినండీ...ఎప్పుడన్నా ఈవిడకిలా నొప్పి వచ్చిందా?" పక్కన కూర్చున్నావిడ అడిగింది.

"లేదండీ...శాంతీ రైలెక్కేటప్పుడేవన్నా నొప్పిగా ఉందా?" వాళ్లావిడని అడిగాడు. లేదన్నట్టుగా తలూపింది.

"మరి ఇంత అకస్మాత్తుగా ఎలా వచ్చిందే. ఇప్పుడేం చేయాలి?" వాళ్లావిడతోనూ, అందరితోనూ బాధగా అన్నాడు.

"టిసిని అడిగితే..మనరైళ్లల్లో ఎవరన్నా డాక్టరుంటే చెబుతాడు" అన్నాడొకాయన.

"టిసి ఇప్పుడెక్కడున్నాడో? అసలు డాక్టరున్నాడో లేడో" నింపాదిగా చూస్తూ అన్నాడు మరొకాయన.

వెంటనే ఇందాక కిటికీ దగ్గర కూర్చున్నాయన లేచి గబగబా"ఉండండి నేను కనుక్కుని వస్తాను" అని దాదాపు పరిగెత్తాడు.

వెళ్లినంత వేగంగా టీసీని వెంటబెట్టుకువచ్చాడు. సారాంశమేమిటంటే ఆ రైల్లో డాక్టర్ లేడు.

"మరెలా? పోనీ ఏ తలనొప్పయినా అయితే ఏ మాత్రో, అమృతాంజనమో ఇచ్చి తగ్గించేవాళ్లం. కడుపునొప్పాయే ఎందుకొచ్చిందో" అందొకావిడ.

"మరే...ఈ మాయదారి కడుపునొప్పులే అంత. రెండేళ్లక్రితం నేనిలాగే రైల్లో ప్రయాణిస్తుంటే ఒకాయన అప్పటికప్పుడు కుప్పకూలిపోయాడు. మరి లేవలేదు" లావుగా ఉన్న మరొకావిడ సంఘటనకి భయం రంగు పులిమింది.

అంతలో కిటికీ ప్రక్కన కూర్చున్న వ్యక్తి "మరేం ఫర్వాలేదు. రోగాలు మనుషులకి కాక ఇంకెవరికి వస్తాయి? మేము లేమా..ధైర్యంగా ఉండండి. కాస్త ఆవిడకి గాలాడనీయండి" అన్నాడు.

"రేపు నాకు ఇంటర్వ్యూ ఉంది. ఇప్పుడు నేను నిద్దరపోకపోతే రేపు ఉద్యోగం రాదు" అంటూ ఇందాక పేకాట ఆడుతూ సొల్లు కొట్టిన యువకుడు బెడ్ ఎక్కి పడుకున్నాడు.

ఓ ముసలాయన ఆస్పత్రిలో బంధువుని చూడ్డానికెళ్లాలంటూ బెడ్ ఎక్కి పడుకున్నాడు. మిగిలిన నలుగురు అసలేమీ మాట్లాడకుండానే చల్లగా జారుకున్నారు. ఇక మిగిలింది కిటికీ ప్రక్కాయన. ఆయన తన పేరు శ్రీనివాస్ అని పరిచయం చేసుకున్నాడు. నన్ను నేనూ పరిచయం చేసుకున్నాం. జ్ఞాపకాల పొరలు కదిలాయి. శ్రీనివాస్ విజయవాడలో మా ఇంటిపక్కనే ఉండేవాడు. ఏదో ఒకవిషయంలో ఆయనకీ, వాళ్లావిడకీ మధ్య మనస్పర్థలు వస్తుండేవి. అందరూ తనవాళ్ళు అనుకోవడం అతని మనస్తత్వం. ఆపదల్లో ఆదుకోవడం నైజం.

శ్రీనివాస్ "చూడండి సార్. మీరలా ఆందోళనగా ఉంటే మీ ఆవిడ ఇంకా బెంబేలు పడిపోతుంది. మనం నెక్స్ట్ స్టేషన్లో దిగిపోయి దగ్గర్లో ఉన్న ఆస్పత్రిలో మీ ఆవిడ్ని చేర్పిద్దాం. మీ దగ్గర డబ్బుంటే సరి. లేదంటే నా దగ్గర క్రెడిట్‌కార్డులున్నాయి. ఆవిడ ప్రాణానికి నా ప్రాణం అడ్డుపెడతా" అన్నాడు.

వాళ్లిద్దరి ముఖాల్లో దైన్యం పోయి ధైర్యం వచ్చింది.

"మీకు శ్రమ ఇస్తున్నామేమో!" అన్నారు.

"లేదండీ. ఒకరికొకరు సాయం చేసుకోకపోతే మానవత్వం అనిపించుకోదు. ఇవాళ నేను మీకు సాయం చేస్తే మీరు రేపు మరొకరికి సాయం చేస్తారు" అన్నాడు వాళ్ల లగేజీని ఒక దగ్గరకి చేరుస్తూ.

అందరికోసం మనం...మనకోసం అందరూ అన్న భావన అందరిలో ఉంటే ఇంక భయాలు ఎందుకు? శ్రీనివాస్ ఇప్పటికీ అలాగే ఉన్నాడు. అతనిలోని మానవతావాదానికి హేట్సాఫ్.

ట్రైన్ స్లో అవుతోంది. ఏదో స్టేషన్‌కి దగ్గరవుతున్నట్టుగా "ఏవండీ మీరు మీ ఆవిడ్ని జాగ్రత్తగా దింపండి. నేను లగేజీ తీసుకువస్తాను" అన్నాడు శ్రీనివాస్.

నేను కూడా వాళ్ల సూట్‌కేస్ అందుకున్నాను. "మీరు!..." వాళ్ళు ఆశ్చర్యపోయారు.

"మంచి హాస్పిటల్ వెతకడానికి గానీ, మందులు తేవడానికి గానీ నేనూ సాయం చేస్తాను. ఉపకారగుణాన్ని బ్రతికిద్దాం. అది మనకి మహోపకారం చేస్తుంది" అన్నాను ముందుకి కదులుతూ.

★